
నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | KAMAREDDY



తాడ్వాయిలో పాల బిల్లులు చెల్లించడం లేదని ఆగ్రహంతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

# పాడి రైతు విలవిల

- కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచి ఇదే గోస
- మూడు నెలలుగా మొత్తం 5 బిల్లులు పెండింగ్‌లో..
- డబ్బులు రాక ఇబ్బందుల్లో వేలాది మంది..
- కేసీఆర్ హయాంలో ఠంచనుగా బిల్లులు మంజూరు
- రేవంత్ పాలనలో పాల రైతుల పరేషన్

పేరుకు పోయిన సర్కారు బకాయిలు



**పాల రైతును** రేవంత్ సర్కారు పరేషాన్ చేస్తున్నది. రైతుభరోసా ఇవ్వకుండా అన్నదాతలను ఆగం చేసిన ప్రభుత్వం.. పాల బిల్లులు చెల్లించక పాడి రైతులను అవస్థల పాలు చేస్తున్నది. పక్షం రోజులకోసారి డబ్బులు చెల్లించాల్సి ఉండగా, మూడు నెలలుగా ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నది. దీంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే తమకు కష్టాలు మొదలయ్యాయని వాపోతున్నారు. సర్కారు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తాజాగా తాడ్వాయిలో రోడ్డెక్కారు. బిల్లులు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాలను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు.

–నిజామాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విజయ డెయిరీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వేలాది పాడి రైతుల నుంచి పాలను సేకరిస్తుంది. పాల కేంద్రాల నుంచి శీతలీకరణ కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి ప్యాకెట్ల ద్వారా టోన్డ్ పాలను సరఫరా చేస్తుంటారు. బహిరంగ మార్కెట్లో ప్రజలకు పాల ప్యాకెట్లను విక్రయించి విజయ డెయిరీ వ్యాపారం చేస్తుంటుంది. అలాగే, పాల నుంచి తీసే కొవ్వుతో నెయ్యి, ఇతరత్రా పదార్థాలను తయారు చేసి, విక్రయిస్తుంటుంది. అలా వచ్చిన డబ్బులను 15 రోజులకోసారి పాల రైతులకు చెల్లించేది. కేసీఆర్ హయాంలో ఠంచన్‌గా బిల్లులు మంజూరయ్యేవి. కానీ, కాంగ్రెస్ సర్కారు రాకతో పాడి రైతులకు పరేషన్ మొదలైంది. సమయానికి పాల డబ్బులు రాక ఆగమవుతున్నారు.

**5 బిల్లులు పెండింగ్..**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారుగా 15 వేల మంది రైతుల పేర్లు విజయ డెయిరీలో నమోదై ఉన్నాయి. పాల సీజన్‌గా పరిగణించే సెప్టెంబర్ – ఫిబ్రవరి మధ్య కాలంలో దాదాపు పది వేల మంది పాలను విక్రయిస్తున్నారు. అన్‌సీజన్‌లో అంటే మార్చి – ఆగస్టు వరకు 5 వేల మంది మాత్రమే పాలు పోస్తుంటారు. పక్షం రోజులకోసారి బిల్లులు చెల్లించాల్సిన విజయ డెయిరీ మూడు నెలలుగా పాడి రైతులకు చుక్కలు చూపిస్తున్నది. ఉమ్మడి జిల్లాలోని వేలాది మందికి జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి 5 బిల్లులు చెల్లించాల్సి ఉంది. రూ.లక్షల్లో బిల్లులు పేరుకు పోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతుల నుంచి సేకరించే పాలతో వ్యాపారం చేస్తున్న విజయ డెయిరీ వారికి ఇవ్వాల్సిన డబ్బులను మాత్రం ఇవ్వడం లేదు. పాల డబ్బులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తే సరైన సమాధానాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు.

**పాల ఉత్పత్తికి ఆటంకం..**

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మూలంగా పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడనున్నది. గతంలో కేసీఆర్ సర్కారు పాడి రైతులను విరివిగా ప్రోత్సహించింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాల అవసరాలను తీర్చేందుకు విజయ డెయిరీని బలోపేతం చేశారు. కానీ ఇప్పుడు పాడి రైతులకు ప్రోత్సాహం కరువైంది. వారికి పాల డబ్బులే సమయానికి ఇవ్వకపోగా నెలల కొద్దీ బిల్లులు పెండింగ్‌లో పెట్టడం ద్వారా రైతులంతా గందరగోళంలో ఉన్నారు. బ్యాంకుల్లో, మహిళా సంఘాల్లో, వడ్డీ వ్యాపారుల దగ్గర పాడి రైతులు చేసిన అప్పులకు క్రమం తప్పకుండా కిస్తీలు కట్టాల్సి ఉండగా, డబ్బుల్లేక ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, పశువులకు దాణా, మిండ్రాల్ మిక్చర్, కాల్షియం, మందుల కొనుగోలుకూ చిల్లిగవ్వ లేదని వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పశువుల పోషణపై తీవ్ర ప్రభావం చూపి, పాల ఉత్పత్తికి ఆటంకం కలిగే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

## రుణమాఫీ కాలే.. పాల బిల్లు రాలే

- కాంగ్రెస్ సర్కారుపై రైతుల ఆగ్రహం
- తాడ్వాయిలో అన్నదాతల రాస్తారోకో
- బిల్లులు ఇవ్వట్లేదని పాలు పారబోసి నిరసన

లింగంపేట, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతులు రోడ్డెక్కారు. వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, ఎలాంటి షరతుల్లేకుండా రూ.2లక్షల పంటరుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఐదు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డపై పాలను పారబోసి నిరసన తెలిపారు. ఎన్నికల సందర్భంగా మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన అనంతరం తమను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా డబ్బులు వెంటనే విడులదల చేయాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లకే కాకుండా అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ఐదు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదని, డబ్బులు రాక పశువులకు దాణా కొనుగోలు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రైతులను తీవ్రంగా మోసగించిందన్నారు. వానకాలం పంటలు చేతికొస్తున్నా రైతుభరోసా ఇవ్వలేదని డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం అందక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చిందని, వానకాలం పంటలు కోతకొస్తున్నా ప్రభుత్వం మాత్రం రైతుభరోసా నిధులు ఇవ్వడం లేదన్నారు. అనంతరం తహసీల్ ఆఫీస్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించారు.

### సకాలంలో బిల్లులు చెల్లించాలి..



కోటగిరి, సెప్టెంబర్ 23: ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో అనేక కష్టాలు పడుతున్నాం. 15 రోజులకోసారి పాల బిల్లులు ఇవ్వాల్సి ఉండే. మూడు నెలల నుంచి ఇస్తలేరు. నాకు రూ.70 వేల కు పైగా రావాలి.. బిల్లులు ఇవ్వకుంటే పశువులకు దాణా ఎట్లా కొనాలే. కూలీలకు డబ్బులు ఎట్లా ఇయ్యాలే. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

**- సుబ్రమణ్యం, పాడి రైతు, కోటగిరి**

### పైసలు ఇయ్యకుంటే ఎట్లా?



పాల కేంద్రంలో పాలు పోస్తు న్నాం కానీ ప్రభుత్వం నుంచి బిల్లులైతే అస్త లేవు. పాలు తీసుకుని పైసలు ఇయ్యకుంటే ఎట్లా? నాకు రూ.45 వేలకు పైగా డబ్బులు అచ్చేది ఉన్నది. అధికారులు స్పందించి నాలుగు విడతల బిల్లులు వెంటనే ఇవ్వాలి.

**- రమేశ్, పాడి రైతు కోటగిరి**

### రూ.3లక్షల దాకా రావాలి..



పాల రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు రావాల్సి ఉండే. కానీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రంలో పాలు పోసే రైతులకు రూ.3లక్షలు బిల్లులు వచ్చేవి ఉన్నాయి. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ దాకా నాలుగు బిల్లులు రావాలె. ప్రభుత్వం, అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.

**- దమ్మలపాటి ఉదయ్, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, మిర్జాపూర్‌క్యాంప్, కోటగిరి**

తహసీల్ ఆఫీసు వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు



# వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికుల ధర్నా

బిచ్కుంద, సెప్టెంబర్ 23: పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా బిచ్కుందలో జీపీ కార్మికులు సోమవారం ధర్నాకు దిగారు. నెలల తరబడి జీతాలు ఇవ్వక పోతే ఎలా బతికేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదని సీఐటీయూ నేత సురేశ్ గౌండ అన్నారు. ఒక్కో జీపీ పరిధిలో పది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, జీతాలు ఇవ్వకుంటే కార్మికులు కుటుంబాలను ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల కనీస వేతనంతో పాటు ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.




పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

## హాస్టల్‌లో వసతులు కల్పించాలని నిరసన

కామారెడ్డి, సెప్టెంబర్ 23: బీబీపేట్ మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సరిపడా గదులు, మరుగుదొడ్లు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. బీబీపేట్‌లోని వసతిగృహంలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. 250 మందికి సరిపోయే హాస్టల్ భవనంలో 430 మంది విద్యార్థులను ఉంచారని తెలిపారు. విద్యార్థుకు సరిపడా గదులు, బాత్రూంలు లేవని, వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు కరుణ, లావణ్య, సోనీ, సుజాత, భారతి, రాజు, స్వామి, శ్రీనివాస్, మొగిలయ్య పాల్గొన్నారు.




ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పొద్దంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా, సాయంత్రం వేళ జడివాన కురిసింది. నిజామాబాద్ నగరంతో పాటు డిచ్‌పల్లి, మాచారెడ్డి తదితర మండలాల్లో వర్షం పడింది. పొద్దంతా ఉక్కపోతతో అల్లాడిన జనాలకు సాయంత్రం కురిసిన వాన కాస్త ఊరట కలిగించింది.




# వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- వరికి ఎండాకు తెగులు, ఇతర చీడపీడలు
- నివారణ చర్యలపై శాస్త్రవేత్తల సూచనలు

రుద్రూర్, సెప్టెంబర్ 23: వానకాలంలో సాగు చేసిన వరి పంటపై తెగుళ్ల దాడి ఉధృతంగా ఉన్నది. వాతావరణ మార్పుల కారణంగా ఎండాకు తెగులు, దోమపోటు తీవ్రంగా ఆశిస్తున్నది. చీడపీడలు ఆశించడం వలన దిగుబడి పడిపోతుంది. కళ్ల ముందే ఎండిపోతున్న పంటను చూసి రైతాంగం ఆందోళన చెందుతున్నది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కనిపిస్తున్న చీడపీడల్లో ఎండాకు తెగులు చాలా ప్రమాదకరమైనది. ఇది దీర్ఘకాలిక రకాలను వరి పంట దుబ్బ కట్టే దశలో ముఖ్యంగా సన్నగింజ రకాల్లో ఈ అధికంగా ఆశిస్తుంది. ఈ తెగులుకు మందు లేదని, లక్షణాలను తొలి దశలోనే గుర్తించి చర్యలను పాటిస్తే నివారించవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

**ఎండాకు తెగులు లక్షణాలు..**

సాధారణంగా వరికి ఎండాకు తెగులు ఆశించినప్పుడు ఆకుల మీద పసుపు రంగు నీటిమచ్చలు ఏర్పడి, అంచుల వెంబడి అలల మాదిరిగా పై నుంచి కిందికి వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన మొక్కలను ఉదయం వేళ గమనిస్తే ఆకుల నుంచి పచ్చని జిగురులాంటి పదార్థం పైకి వస్తుంది. ఈ పదార్థం సూర్యరశ్మికి గట్టిపడి చిన్న చిన్న ఉండలుగా మారి, గాలి వీచినప్పుడు ఆకు నుంచి నీటిలో పడిపోతాయి. కిందపడిన ఉండలు నీటి ద్వారా మరో మొక్కకు, ఇతర మడులకు వ్యాపిస్తుంది. వరి ఈనే దశలో తెగులు వ్యాపిస్తే ఆకుల్లో హరిత పదార్థం తగ్గడంతోపాటు వెన్నులు పాక్షికంగా బయటికి వస్తాయి. దీంతో గింజ పాలుపోసుకోదు. ఈ తెగులు లక్షణాలు ఎక్కువగా చెట్టు నీడన ఉన్న పొలాల్లో ఎక్కువగా కనబడుతుంది.



ఎండాకు తెగులు సోకిన వరి పంట

**తెగులు ఆశించడానికి గల కారణాలు..**

గాలిలో తేమ శాతం అధికంగా ఉండడం, ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురవడం, అధిక వేగంతో గాలులు వీయడం, సగటు ఉష్ణోగ్రతలు 22–26 సెంటిగ్రేడ్ మధ్య ఉంటే ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. రైతులు అధిక మోతాదులో నత్రజని ఎరువులను వినియోగించడం కూడా ఈ తెగులు ఉధృతికి కారణమని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

**యాజమాన్య పద్ధతులు..**



రైతులు పొలాన్ని ఎప్పటికప్పుడు గమనించి, ఎండాకు తెగులు లక్షణాలు 5 శాతం కన్నా ఎక్కువ అయితే నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా నిలిపి వేయాలి. ఈ తెగులు సాగునీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది. కావున ఆశించిన పొలం నుంచి ఇతర పొలాలకు నీరు పారకుండా చేయాలి. పొటాష్ ఎరువును దమ్ములో, ఆకరి దఫాలో ఎకరాకు 15 కిలోల చొప్పున వేయాలి. ప్రతి ఏడాది ఈ తెగులు స్థానికంగా ఆశిస్తే ఆ ప్రాంతాల్లో ఇంట్రాస్టు సాంబామసూరి అనే తెగులు తట్టుకొనే (ఆర్పిబయో 226) రకాన్ని సాగుచేయాలి. తెగులు లక్షణాలు దుబ్బ కట్టే దశ నుంచి చిరు పొట్ట దశలో గమనిస్తే కాఫర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, ప్లాంటామైసిన్ లేదా పోషామైసిన్ లేదా అగ్రిమైసిన్ 0.4 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు వ్యాప్తిని కొంతవరకు నియంత్రించవచ్చు. ఈ తెగులును పూర్తిగా నివారించడానికి ఎలాంటి మందులు అందుబాటులో లేవు. సమగ్ర ఎరువుల యాజమాన్యంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

### ఎప్పటికప్పుడు పొలాన్ని గమనించాలి..



పంటలను రైతులు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. వరిలో ఎండాకు తెగులు బ్యాక్టీరియా వ్యాప్తి చెందినప్పుడు వ్యవసాయ ధికారులు లేదా సంబంధిత శాస్త్రవేత్తలను సంప్రదించి సలహాలు తీసుకొని, తగిన చర్యలు చేపడితే పంట నష్టాన్ని అధిగమించవచ్చు. లేకపోతే తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

**- విజయ్‌కుమార్, శాస్త్రవేత్త**



## కామారెడ్డిలో హాస్య'బ్రహ్మ' సందడి

కామారెడ్డి, సెప్టెంబర్ 23: కామారెడ్డిలో ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం సోమవారం సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని బాంబే క్లాత్‌ను ఆయన ప్రారంభించారు. తమ అభిమాన హాస్య నటుడిని చూసేందుకు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అభిమానులు భారీగా తరలి వచ్చారు . షోరూం ప్రారంభోత్సవానికి విచ్చేసిన బ్రహ్మానందంతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. షోరూం నిర్వాహకులు హాస్య నటుడిని ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ, వీటీ రాజ్‌కుమార్, వీటీ లాల్ తదితరులు పాల్గొన్నారు.